నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 23 2025
MONDAY JUNE 23, 2025

## ఐటీఐ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం

సుభాష్‌నగర్, జూన్ 22 : నగరంలోని ఐటీఐ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఖిల్లా రఘునాథ ఆలయంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వట్టల్‌వార్ ప్రమోద్ మాట్లాడుతూ. అసోసియేషన్ ద్వారా ధార్మిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 29న రాష్ట్రంలోని పలు ఆలయాలను 40 మందితో సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. రఘునాథ ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు సామూహికంగా రామరక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా పఠించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ప్రమోద్ హర్గె, మనోహర్‌శాస్త్రి, దిగంబర్, న్యాలం శ్రీనివాస్‌రావు, ప్రసాద్ జోషి, సంతోష్ నిర్మల్‌కర్, న్యాలం రమేశ్‌రావు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఖలీల్‌వాడి, జూన్ 22 : కాకతీయ జూనియర్ కళాశాలలో చదువుకున్న 2002-2004 బ్యాచ్ సీఈసీ గ్రూర్ విద్యార్థులు అదే కళాశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకొని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా బ్యానర్‌తో సహా గ్లాసులు, ప్లేట్లు తదితర వస్తువులతో జరుపుకోవడం విశేషం. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నివారణకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి'

ఖలీల్‌వాడి, జూన్ 22 : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. నగర సీపీఐ మహాసభను నగరంలోని రైస్‌మిల్ ఫిట్టర్స్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఓమయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అడవులను స్వాధీనం చేసుకొని, ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నదని అన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలుపుతున్నప్పటికీ వారిని చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ




క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ఖలీల్‌వాడి, జూన్ 22 : పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన ప్రజలకు, వీరజవాన్ల మృతికి సంతాపంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్ నుంచి భగత్‌సింగ్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించగలమన్నారు. కార్యక్రమంలో అనిత, దీపిక, రేఖ, సత్యశీల, అస్మిత, జ్యోతి, కళ, సునీత, రాజు, దినేశ్ పాల్గొన్నారు.

# టెన్త్ టాపర్లకు ఎమ్మెల్యే వేముల సన్మానం



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, జూన్ 22 : మండలంలోని 10వ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సన్మానించారు. మండల స్థాయిలో ఎస్సెస్సీ ఫలితాలల్లో టాపర్‌గా నిలిచిన జడ్పీహెచ్‌ఎస్ మోతె విద్యార్థిని సౌన్నాయిల శ్రీనిధి, పాఠశాల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన మూడ్ శివన్విత, పెంజర్ల నవనీతను అభినందించారు. కార్యక్రమంలో డొల్ల రాజేశ్వర్‌రెడ్డి, మోతె పాఠశాల హెచ్‌ఎం వైద్య గణేశ్, ఉపాధ్యాయులు మంచే గణేశ్, బీఆర్‌ఎస్ నాయకులు నాగధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### రూ.10వేల ఆర్థిక సాయం అందజేత

ముప్కాల్, జూన్ 22: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త రఫిక్ తమ్ముడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం సాయంత్ర రఫిక్ కుటుంబాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రశాంత్ రెడ్డికి కార్యకర్త కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ సామ వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

### పరామర్శ

బాల్కొండ, జూన్ 22: మండలంలోని కిసాన్‌నగర్, ఇత్వార్‌పేట్, జలాల్‌పూర్ గ్రామాల్లో పలు కుటుంబాలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు అవసరం

సీపీ సాయిచైతన్య



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్, జూన్ 22 : మానసికోల్లాసానికి క్రీడలు చాలా అవసరమని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌గ్రౌండ్‌లో పోలీసు సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. పోలీసుసిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి గురవుతారని, క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ సబ్ డివిజన్లతోపాటు ఆర్ముడ్ రిజర్వ్ విభాగం, హోమ్‌గార్డ్స్ తదితర విభాగాల సిబ్బందికి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్లు బస్వారెడ్డి, రామ్‌చందర్‌రావు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌తో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- 25 మందిపై కేసు నమోదు

వినాయక్‌నగర్, జూన్ 22 : సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తార్ అలీ పర్యవేక్షణలో ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి నగరంలోని కంఠేశ్వర్ ఏరియాలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 25 మంది వాహనదారులను గుర్తించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. డ్రైవింగ్ చేస్తున్న ఓ మైనర్‌పై సైతం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామ్, సిబ్బంది

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

సిరికొండ, జూన్ 22 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై రామ్ అన్నారు. మండలంలోని తాళ్ల రామడుగు గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాల జోలికి పోవద్దని సూచించారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

సుభాష్‌నగర్, జూన్ 22 : తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సుభాష్‌నగర్ పెన్షనర్ సంఘ కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ప్రముఖ న్యాయవాది గిరిధర్‌రావు వ్యవహరించారు. అధ్యక్షుడిగా శశికాంత్ కులకర్ణి, గౌరవ అధ్యక్షుడిగా భూపతిరావు, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌బాబు కులకర్ణి, ఉపకార్యదర్శిగా న్యాలం రమేశ్‌రావు, కోశాధికారిగా మిలింద్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 'ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదు'

కంఠేశ్వర్, జూన్ 22 : రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరు పర్యవేక్షణకు ఎస్‌జీటీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం సరికాదని, ఇది విద్యారంగ తిరోగమన చర్య అని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మేందర్, శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది విద్యారంగ సంక్షోభానికి దారి తీస్తుందని, ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 10 ఏండ్ల అనుభవమున్న వంద మంది ఉపాధ్యాయులకు తనిఖీ బాధ్యతలు అప్పగిండం ద్వారా పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందని పేర్కొన్నారు. వెంటనే డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

## ఎల్‌వోసీ అందజేత

డిచ్‌పల్లి, జూన్ 22 : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఆటో బాబా సోదరి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎల్‌వోసీ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

సిరికొండ, జూన్ 22 : మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు కిరణ, విష్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సూచనలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

బీటెక్‌లో ఫెయిలైనట్లు కుటుంబీకులకు తెలిసిందని..



శ్రీనివాస్(ఫైల్)

వినాయక్ నగర్, జూన్ 22: బీటెక్‌లో పాసైనట్లు అందరికీ నమ్మించి చివరికి ఫెయిలైనట్లు తెలియడంతో మనస్తాపం చెంది రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సాయికృపానగర్‌కు చెందిన రాజరపు శ్రీనివాస్ (25) తాను బీటెక్ పాసైనట్లు తల్లిదండ్రులు, బంధువులకు ఇదివరకే చెప్పుకున్నాడు. శనివారం శ్రీనివాస్ ఫెయిల్ అయ్యాడనే నిజం తల్లికి తెలిసింది. దీంతో ఈ విషయాన్ని కొడుకును అడుగగా తీవ్ర మనస్తాపం చెంది, అవమానంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో నిజామాబాద్, డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ల మధ్య మృతదేహం ఉన్నట్లు తెలుసుకున్న రైల్వే పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, శ్రీనివాస్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

## ప్రమాదం అంచున ప్రయాణం



*కోటగిరి మండలంలో కొందరు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. హమాలీలు, కూలీలు, విద్యార్థులు వాహనాల్లో ప్రమాదకరంగా వేలాడుతూ నిలబడుతున్నారు. ఆదివారం కోటగిరి- పొతంగల్, రుద్రూర్ ప్రధాన రహదారిపై మినీ ట్రాలీ ఆటోలో పరిమితికి మించి కూలీలు ప్రయాణిస్తుండగా 'నమస్తే తెలంగాణ'క్లిక్ మనిపించింది.*

*– కోటగిరి, జూన్ 22*

## మెడికల్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

జక్రాన్‌పల్లి, జూన్ 22 : కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మెడికల్ అసోసియేషన్ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండ్యాల రమేశ్ (జక్రాన్‌పల్లి), కార్యదర్శిగా కరుణాకర్ (కలిగోట్), క్యాషియర్‌గా అంకుశం (మునిపల్లి)ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మూడు సార్లు వరుసగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెండ్యాల రమేశ్‌ను జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

## ఒకే రోజు నాలుగు పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ బస్సు

శక్కర్‌నగర్, జూన్ 22: ఒకే రోజు నాలుగు పుణ్యక్షేత్రాల దర్శనానికి గాను ఈనెల 27న ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఆర్టీసీ డీఎం విశ్వనాథం, బుకింగ్ అధికారులు ఆదివారం వెల్లడించారు. ఇందుకు గాను ప్రత్యేకంగా బస్సు ఏర్పాటుతో పాటు, బస్సు దర్శించే క్షేత్రాల వివరాలతో పాటు చార్జీల వివరాలను ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 27న ఉదయం బోధన్ డిపో నుంచి బయల్దేరే బస్సు మాక్లూర్ మండలం మామిడిపల్లి శివారులోని అపురూప వేంకటేశ్వర స్వామి దర్శనం చేయించి, అక్కడి నుంచి జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, వేములవాడ రాజరాజేశ్వరీ ఆలయాల దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం బస్సు తిరిగి వస్తుందని తెలిపారు. భక్తులు ఒక్కొక్కరికి రూ.660 చెల్లించి సీట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 9959226001, 7382843670, 6301415975 నంబర్లకు ఫోన్ చేయాలని వారు సూచించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

## 'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

మోర్తాడ్, జూన్ 22: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మోర్తాడ్ మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మోర్తాడ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఉద్యమకారుల హామీలను నెరవేర్చకపోవడం విడ్డూరమన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లూరి రాజారాం, నర్సయ్య, గంగాధర్, బాబురావు, దశరథ్ పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా పాఠశాల బోర్డు



ప్రాథమికోన్నత పాఠశాల బోర్డు


మాక్లూర్, జూన్22: మండలంలోని గంగరమంద గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన బోర్డు అస్తవ్యస్తంగా మారింది. గేటు వద్ద ఉన్న బోర్డుపై రాసిన అక్షరాలు పూర్తిస్థాయిలో కనిపించడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రాథమిక అవసరాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, ఆ నిధులతో హెచ్‌ఎం టాయిలెట్ల, కిటికీలు, తలుపులు, నేమ్‌ప్లేట్ల మరమ్మతు, కలర్లు వేయించడం, చాక్‌పీస్‌లు, డస్టర్లు కొనుగోలు చేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి నిధులున్నా హెచ్‌ఎం పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ధర్పల్లిలో నేడు 'మార్నింగ్ వాక్'

ధర్పల్లి, జూన్ 22 : డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ధర్పల్లిలో సోమవారం ఉదయం 6 గంటలకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ నిర్వహించనున్నట్లు ఎస్సై రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్, గాంధీచౌక్ నుంచి ప్రధాన వీధుల గుండా మార్నింగ్ వాక్ ఉంటుందని తదెలిపారు. గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నిరుపేద కుటుంబానికి రైడ్స్ కమిటీ భరోసా

- చిన్నారులను వసతిగృహంలో చేర్పిస్తామని హామీ



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రైడ్స్ కమిటీ సభ్యులు

రుద్రూర్, జూన్ 22 : మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి రైడ్స్ కమిటీ సభ్యులు భరోసా కల్పించారు. మండలకేంద్రంలో నిలువ నీడ లేకుండా ప్రభుత్వ భవనాల్లో తలదాచుకుంటున్న ఓ నిరుపేద దంపతులకు ఆరుపిల్లలు ఉన్నారు. రైడ్స్ కమిటీ సభ్యులు, కానిస్టేబుల్ సురేశ్ చిన్నారుల తల్లిదండ్రులతో ఆదివారం మాట్లాడి, చిన్నారులను అన్ని సౌకర్యాలు ఉన్న వసతిగృహంలో చేర్పిస్తామని కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో రైడ్స్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు నూత్‌పల్లి బాలరాజు, సలహాదారులు టీపీ రాజేందర్, ఓముల సాయన్న, చిక్కెల అశోక్, సురేశ్ పాల్గొన్నారు.

## బంజారా సేవా సంఘం ప్రతినిధులకు సన్మానం



కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ బోధన్ పట్టణ ప్రతినిధులు

శక్కర్‌నగర్, జూన్22: బోధన్ పట్టణ బంజారా సేవా సంఘం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేగావత్ ధూప్‌సింగ్ నాయక్, ప్రవీణ్ జాదవ్‌ను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. కురుమ కులస్తుల సమస్యలను పరిష్కరించడంలో సంఘం ప్రతినిధులు ముందుండాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ వారికి సూచించారు.
కార్యక్రమంలో నాయకులు బెంజర్ గంగారాం, నాగుల రవిశంకర్ గౌడ్, ఎన్ఆర్ఐ అహ్మద్, శంకర్ గౌడ్, సాగర్, శంకర్, నసీర్, ఆశీంలు ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొందాలి



బాబానగర్‌లో అడ్మిషన్ డ్రైవ్..

భీమ్‌గల్, జూన్ 22: ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొందాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ టెన్త్ పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాలలోని సౌకర్యాలను వివరించారు. గ్రామాల్లో వారికి ఇంటి వద్దనే అడ్మిషన్ ఇచ్చారు. కార్యక్రమంలో లెక్చరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డెస్క్ బెంచీల వితరణ

భీమ్‌గల్, జూన్22: మండలంలోని చేంగల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు దయానంద్‌రెడ్డి ఆదివారం డెస్క్ బెంచీలను వితరణగా ఇచ్చారు. సుమారు రూ. లక్షా 11 వేల విలువగల డ్యుయల్ డెస్క్‌లను బాల్కొండకు చెందిన పీడీ జి. రాజేశ్వర్ ద్వారా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు టి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు దయానందరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## కోనాసముందర్‌లో వైద్యశిబిరం

మోర్తాడ్, జూన్ 22: కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలో ఆదివారం నిహారిక చిల్డ్రన్ హాస్పిటల్ వారు పిల్లల వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 150 మంది పిల్లలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నిహారికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బోనాలు

బోధన్/బోధన్ రూరల్/ఏర్గట్ల, జూన్ 22: బోధన్ పట్టణంలో ఆదివారం ఆరుద్ర సందర్భంగా రెడ్డికా కుల సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను నిర్వహించారు. ఏటా ఆరుద్ర కార్తె ప్రారంభం సందర్భంగా బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పండుగను ఐదు తర్వలకు చెందిన రెడ్డికా కులస్తులు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మీ మందిరానికి బోనాలతో వెళ్లి పూజలు నిర్వహించారు. వర్షాలు కురవాలని కోరుతూ బోధన్ మండలంలోని కొప్పర్గ గ్రామంలో కురమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్గట్ల మండలంలోని తొర్తి గ్రామస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు యాటలను బలిచ్చి వన భోజనాలు చేశారు.

## ఘన నివాళి..

ఆర్మూర్‌టౌన్, జూన్22: తెలంగాణలోని పలు జిల్లాలో యేసు ప్రభువు సేవ చేసి, అనాథలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుడు జాన్ వెస్లీ మంగళవారం మృతి చెందగా ఆదివారం పిప్రి గ్రామంలోని ఎల్‌షడ్డాయి చర్చిలో నివాళులర్పించారు. పాస్టర్ జి.శేఖర్ ఇడ్విన్, సంఘ పెద్దలు జలంధర్, చందు, ఫ్రాన్సిస్ సంఘ సభ్యులు స్టీవెన్ రాజ్, ప్రవీణ్, భోజేందర్, శ్యామ్, చిన్న, అనిల్, ప్రభుకుమార్, సన్నీ, నితిన్, ప్రనయ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

I, ENAKURTHI VINAY S/O. Enakurthi Srinivas Rao R/o. H.No. 3-91/2, Vill: Hegdoli, Mdl: Kotagiri, Dist. Nizamabad T.G. My Passport No B7246448 Date of Issue 04-11-2023 Date of Expiry 03-11-2033 Place of Issued Hyderabad is Missing while I was travelling on bike from home to Bus Stand I am Unable to trace if any body found Place Cell: 9640593348

NTZ-338674

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 'పరిశోధన' పసుపు సాగు ప్రారంభం



పసుపు పరిశోధన కేంద్రంలో పసుపు వెరైటీలు వేసేందుకు కొలతలు కొలుస్తున్న కూలీలు

మోర్తాడ్, జూన్ 22: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రంలో పరిశోధన కోసం పసుపు విత్తనాలు వేయడం ప్రారంభమైంది.

వారం రోజులుగా 315 రకాలకు సంబంధించిన పరిశోధన కోసం విత్తనాలు వేసేందుకు మూడు మీటర్ల పరిధిలో ఒక్కో రకాన్ని నాటేందుకు కూలీలతో కొలతలు కొలిపించి విత్తనాలు వేయిస్తున్నారు. విత్తనాలు వేసేకంటే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయిస్తున్నారు. దాదాపు ఆరెకరాల్లో పరిశోధన కోసం దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించిన పసుపు రకాల విత్తనాలను వేస్తున్నామని శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు. మరోవైపు రైతులకు విత్తనాలు ఇచ్చేందుకు మరో నాలుగు ఎకరాల్లో దుగ్గిరాల, సేలం, రాజాపురి, ప్రతిభ, పితాంబరి తదితర రకాలను వేయిస్తున్నట్లు చెప్పారు. మరోరెండు మూడు రోజుల్లో అన్ని రకాలు విత్తనాలు వేసే పనులు పూర్తవుతాయని తెలిపారు.

## సీఎస్ఐ నూతన పాస్టరేట్ కమిటీ ఎన్నిక



నియమితులైన పాస్టరేట్ నూతన కమిటీ ప్రతినిధులు

శక్కర్‌నగర్, జూన్ 22: బోధన్ పట్టణం శక్కర్‌నగర్ సీఎస్ఐ చర్చి పాస్టరేట్ ప్రతినిధులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చర్చిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ మున్కల ప్రభాకర్ ఆధ్వర్యంలో పాస్టరేట్ కమిటీని ఎన్నుకున్నారు. దమ్మల్ల జ్యోతి రాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, వీ డబ్ల్యూ రాజేశ్, సీహెచ్ బెన్హర్ తోపాటు ఈ.సునీత డేవిడ్ పాస్టరేట్ కమిటీ ప్రతినిధులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాస్టరేట్ కమిటీ ప్రతినిధుల ఎంపిక అనంతరం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. అందరి సహకారంతో చర్చి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## ఆటోను ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్



బోల్తాపడిన ఆటో

రుద్రూర్, జూన్ 22 : మండలంలోని అక్బర్‌నగర్ వద్ద ఆటోను పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటన చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం వర్ని నుంచి రుద్రూర్ వైపు వెళ్తున్న ఆటోను అదే రూట్‌లో వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో డ్రైవర్‌తోపాటు ఇద్దరు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని, ఆటోలో ఉన్న వ్యక్తులను బయటికి తీశారు. ఆటోలో ఉన్న ఓ మహిళకు కాలు విరగగా.. చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కంఠేశ్వర్, జూన్ 22 : నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్.. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఆదివారం అందజేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 572 మందికి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఇంద్రాపూర్‌లోని యాదవ సంఘంలో 261 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ చైర్మన్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

### షబ్బీర్‌అలీ, మహేశ్‌కుమార్‌తో కలెక్టర్ భేటీ

కంఠేశ్వర్, జూన్ 22 : నగరంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి భేటీ అయ్యారు. అతిథి గృహం వద్ద వారికి పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు. అనంతరం గెస్ట్‌హౌస్‌లో జిల్లా అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.